సాక్షి అనకాపల్లి

బుధవారం । 26 । జూన్ । 2024



ముగిసిన యోగా చిత్ర ప్రదర్శన

విశాఖ: సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఏయూ యోగా విలేజ్‌లో నిర్వహిస్తున్న చిత్ర ప్రదర్శన మంగళవారం ముగిసింది.



స్నపన తిరుమంజనం

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు.

గరిష్ఠం/కనిష్ఠం
35.8/26.0

వాతావరణం

తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండుచోట్ల పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

త్వరలో ఆలయాలకు కొత్త పాలక మండళ్లు

- దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి

నక్కపల్లి: జిల్లాలో దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో కొత్త పాలక మండళ్ల నియామకానికి త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఆ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కేఎల్ సుధారాణి తెలిపారు. మంగళవారం ఆమె నక్కపల్లిలో మాట్లాడుతూ గతంలో ఏర్పాటైన పాలక మండళ్లన్నీ రద్దయ్యాయన్నారు. అప్పట్లో నియమితులైన చైర్మన్లు, పాలకమండలి సభ్యులు స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారన్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కొత్త పాలక మండళ్ల ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. జిల్లాలో 6ఏ ఆలయాలు 3 ఉండగా, 6బీ కేటగిరికి చెందిన ఆలయాలు 25 ఉన్నాయన్నారు. వీటన్నింటికీ నూతన పాలక మండళ్లు ఏర్పాటు చేస్తామన్నారు. గతంతో పోలిస్తే ఆలయాలకు వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతోందన్నారు. యువతలోనూ భక్తిభావం కనిపిస్తుందన్నారు. ఆలయాలకు వచ్చే భక్తులకు కనీస సదుపాయాలు కల్పించడమే లక్ష్యమన్నారు. ఆమె వెంట ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ రాజు, పాయకరావుపేట పాండురంగ స్వామి దేవస్థానం ఈవో వెంకటాద్రి ఉన్నారు.

1 నుంచి శ్రీవారి ఆర్జిత సేవలు



శ్రీవారి ఆలయ ముఖద్వారం

కొమ్మాది (విశాఖ): రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జూలై 1వ తేదీ నుంచి శ్రీవారి సేవల్లో భక్తులు పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు దేవస్థానం నిర్వాహకులు తెలిపారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే సుప్రభాత సేవకు ఒకరికి రూ.100, పుష్పాలంకరణకు రూ.12,000(నలుగురు కుటుంబ సభ్యులు), 8 గంటలకు నిర్వహించే తోమాల సేవకు ఒక్కొక్కరికి రూ.200, 8.30 జరిగే సహస్ర నామార్చనకు ఒక్కొక్కరికి రూ. 200, 9.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు జరిగే అర్చనకు ఒక్కొక్కరికి రూ.100, ప్రతీ శుక్రవారం ఉదయం 6.30 గంటలకు నిర్వహించే శ్రీవారి అభిషేకానికి ఒక్కొక్కరికి రూ. 250, ఏకాంత సేవకు రూ.100, వేదాశీర్వచనానికి రూ.1,500(నలుగురు వరకు), భోగంనకు రూ.10,000 చొప్పున నిర్ణయించారు. ఈ సేవల్లో పాల్గొనే భక్తులు దేవస్థానాన్ని సంప్రదించాలని సూచించారు.

ఏయూ దూరవిద్యా కేంద్రం సంచాలకుడిగా విజయ్‌మోహన్



ఉత్తర్వులు స్వీకరిస్తున్న ఆచార్య విజయ్ మోహన్

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రం సంచాలకుడిగా ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగ సీనియర్ ఆచార్యుడు ఎస్.విజయ్‌మోహన్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి నుంచి మంగళవారం ఆయన నియామక ఉత్తర్వులు స్వీకరించారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య విజయ్‌మోహన్‌ను వర్సిటీ ఆచార్యులు, ఉద్యోగులు అభినందించారు.

'పద్మ' అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట (విశాఖ): కేంద్ర ప్రభుత్వం.. 2025 గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటించే 'పద్మ'అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ అవార్డులకు దరఖాస్తు చేసే వారు పలు రంగాల్లో విశిష్ట సేవలు అందించి ఉండాలని పేర్కొన్నారు. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక/సాంఘిక సేవ, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ప్రజా సంబంధాలు, సివిల్ సర్వీసులు, ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ రంగాల్లో విశిష్ట సేవలందించినవారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని చెప్పారు. https:// awards.gov.in ద్వారా వచ్చే నెల 18వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆ దరఖాస్తు జిరాక్స్ కాపీతో పాటు సాఫ్ట్ కాపీని జిల్లా యువజన సంక్షేమ అధికారి/ముఖ్య కార్యనిర్వహణాధికారి,సెట్విస్ కార్యాలయం, యువజన భవన్, మహారాణిపేట చిరునామాలో సమర్పించాలని సూచించారు. ఇతర వివరాలకు సెట్విస్ సీఈవోను సంప్రదించాలన్నారు.

నేడు ప్రపంచ మాదక ద్రవ్యాల విముక్తి దినోత్సవం



మొదట్లో సరదాగా తీసుకున్న మత్తు పదార్థాలే బానిసను చేస్తాయి. ఇక వాటి నుంచి బయటపడలేక ఆత్మస్థైర్యం కోల్పోతారు. ఏ పనీ చేయడానికి ఇష్టపడరు. ఆపై సంపాదన లేక ఆర్థిక ఇబ్బందులు పడతూ కుటుంబాలను పోషించలేక బలవన్మరణాలకు పాల్పడుతుంటారు. ఇలా ఎంతోమంది జీవితాలు ఛిన్నాభిన్నమవుతున్న నేపథ్యంలో అటువంటి వారిలో పరివర్తన తీసుకురావడానికి **డీ అడిక్షన్ సెంటర్ కృషి చేస్తోంది. మరలా జనజీవన స్రవంతిలో సాధారణ జీవనం ప్రారంభించేలా పనిచేస్తోంది.**

పరివర్తన

- మత్తుకు బానిసైన వారికి చికిత్స
- జిల్లాలో డీ అడిక్షన్ సెంటర్ సేవలు
- నెల రోజులపాటు ఉచిత వైద్యం, భోజన వసతి
- ఇప్పటి వరకు 250 మందికి విముక్తి

నక్కపల్లి: మత్తుపదార్థాలకు బానిసయితే జీవితం నాశనం కావడంతోపాటు వారిపై **ఆధారపడ్డ ఆ** కుటుంబాలు ఛిన్నాభిన్నమవు**తాయి. తమ** ఆరోగ్యాలను పాడుచేసుకోవడం**తోపాటు, సమా**జంలోనూ చులకనైపోతారు. **ఇటువంటి వారు** మత్తుపదార్థాల నుంచి బయట **పడ్డారంటే కొత్త** జీవితాన్ని ప్రారంభించినట్లే. ఇటు**వంటి వ్యసనప**రులను మత్తు నుంచి విముక్తి కల్పిం**చేందుకు కేంద్ర** ప్రభుత్వం చర్యలు చేపట్టింది. స్వ**చ్ఛంద సంస్థల** సహకారంతో పునరావాస కేంద్రా**లు ఏర్పాటు** చేస్తోంది. ఇప్పటి వరకు పట్టణాల**కే పరిమితమైన** ఇటువంటి డీ అడిక్షన్ సెంటర్ (వ్యస**న విముక్తి కేం**ద్రం) అనకాపల్లి జిల్లాలోనూ ప్రారం**భమైంది. అన**కాపల్లి మండలం పిసినికాడ కేం**ద్రంగా పరివర్తన** పేరుతో వ్యసన విముక్తి కేంద్రం ఆ**ర్నెల్ల క్రితం తమ** కార్యకలాపాలు ప్రారంభించింది. మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ సంస్థ పర్యవేక్షణలో సీడ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఏర్పాటైన వ్యసన విముక్తి కేంద్రం వ్యసనపరుల్లో పరివర్తన తీసుకొచ్చేందుకు కృషి చేస్తోంది. ఇప్పటివరకు 45 మందిని ఇన్‌పేషెంట్లుగా చేర్చుకుని చికిత్స అందించి వారిలో పరివర్తన తీసుకొచ్చింది. 250 మందిని ఔట్‌పేషెంట్లుగా కౌన్సెలింగ్ చికిత్స అందించి మత్తు పదార్థాలకు దూరం చేసింది.

వైద్య సిబ్బంది పర్యవేక్షణలో విముక్తి కేంద్రం..

కేంద్ర ప్రభుత్వ సహకారం, పర్యవేక్షణలో నడిచే పరివర్తన కేంద్రంలో వైద్యుడు, నర్సులు, కౌన్సెలర్లు, మానసిక వైద్యనిపుణులు, యోగా ఇన్‌స్ట్రక్టర్లు, కుటుంబ సలహాదారులు, ఆధ్యాత్మిక వేత్తలు, మనోల్లాస ఉపాధ్యాయులు పనిచేస్తారు. వీరందరి పర్యవేక్షణలో ఇక్కడ ఒకేసారి 15 మంది పేషెంట్లను చేర్చుకుని ఉచిత భోజన వసతి కల్పించి వైద్య సహాయం అందించే ఆస్పత్రి ఉంది. నెల రోజులపాటు ఇక్కడ అన్ని వసతి సదుపాయాలు కల్పిస్తారు.

బాధితుల గుర్తింపు ఇలా...

విముక్తి కేంద్రంలో పనిచేసే సిబ్బంది, కౌన్సెలర్లు ఎక్కువగా మద్య ప్రభావిత గ్రామాలను, ఏరియాలను గుర్తిస్తారు. అక్కడ బాధిత కుటుంబాలతో మమేకమవుతారు. వారికి ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రామాణికాలను అనుసరించి పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షల్లో బాధితుడిని కొన్ని ప్రశ్నలు అడిగిం సమాధానాలు రాబడతారు. వచ్చిన సమాధానాలను బట్టి వ్యసన తీవ్రతను గుర్తిస్తారు. అటువంటి వారికి ఇన్‌పేషెంట్లుగా లేదా ఔట్‌పేషెంట్లుగా చికిత్స చేయాలా అనేది నిర్ధారిస్తారు.



అనకాపల్లి సమీపంలో పిసినికాడ వద్ద ఏర్పాటు చేసిన పరివర్తన వ్యసన విముక్తి కేంద్రం



కేంద్రంలో చేరిన వ్యసనపరులకు యోగా శిక్షణ

చికిత్స ఇలా...

మత్తుపదార్థాలకు బానిసైన వారిని కుటుంబ సభ్యులు, అంగన్‌వాడీ కేంద్రాల అవగాహన కార్యక్రమాల ద్వారా గుర్తిస్తారు. ఆ తర్వాత విముక్తి కేంద్రంలో చేర్చుకుంటారు. వ్యసనపరుల ఆరోగ్య పరిస్థితిని తీవ్రతను బట్టి రెండు రకాలుగా చికిత్స అందిస్తారు. ఇన్‌పేషెంట్లయితే నెల రోజులపాటు ఈ కేంద్రంలో ఉండాలి. ఔట్‌పేషెంట్లు వారానికి, నెల కొకమారు కేంద్రానికి వచ్చి మందులు వాడటం, కౌన్సెలింగ్ తీసుకోవడం వంటివి చేస్తారు. వీరితో ఒకేసారి మాన్పించడం కూడా కష్టమే. అలా చేస్తే మంచి కంటే చెడు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అస్వస్థతకు గురయ్యే అవకాశాలు ఉంటాయి. వారే స్వచ్ఛందంగా మత్తు పదార్థాలను మానేసే స్థాయికి తీసుకొస్తారు. మత్తు పదార్థాల నుంచి దూరం కావడం కోసం ఇక్కడ మందులు, ఇంజక్షన్, కౌన్సెలింగ్ ద్వారా చికిత్స అందిస్తారు. వారికి యోగా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ఉల్లాసం, ఆనందం కలిగించే కార్యక్రమాలు నిర్వహిస్తారు. మానసికంగా వీరంతా మత్తుకు దూరమయ్యేలా కార్యక్రమాలు నిర్వహిస్తారు. వీరికి ఈ పునరావాస కేంద్రంలో టీవీ, దిన, మాసపత్రికలు, మ్యాగజైన్లు, ఆధ్యాత్మిక గ్రంథాలను అందుబాటులో ఉంచుతారు. వీరికి రోజూ పతంజలి, అష్టాంగ యోగాసనాలు, ప్రాణాయామం కూడా నేర్పిస్తారు. చికిత్స పూర్తయిన తర్వాత కూడా వీరిపై రెండేళ్లపాటు పర్యవేక్షణ ఉంటోంది.

మత్తుకు బానిస కాకుండా ముందస్తు చర్యలు

మత్తుకు బానిస కాకుండా ముందు జాగ్రత్త చర్యలు, అవగాహన కార్యక్రమాలను విముక్తి కేంద్రం నిర్వాహకులు చేపడతారు. సంఘంలో గౌరవ మర్యాద గలవారిని పీర్ ఎడ్యుకేటర్లుగా నియమిస్తారు. వీరి ద్వారా 16 నుంచి 18 ఏళ్ల వయసు గల యువతను గుర్తిస్తారు. రోజు మత్తుపదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తారు. వీరి సాయంతో ఆయా గ్రామాలు, వార్డుల పరిధిలో మత్తుకు బానిసైన వారికి, యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. డ్రగ్స్‌కు అలవాటు పడకుండా వారిలో చైతన్యం తీసుకువస్తారు. చిన్న వయసులోనే మత్తుకు అలవాటు పడకుండా ఉండేందుకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు.



విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు



గ్రామాల్లో మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కలలోనూ ఊహించలేదు

నేను ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాను. ఫొటో, వీడియో షూటింగ్‌లు చేయడంతోపాటు, పొలిటికల్ పార్టీ సమావేశాలను కవర్ చేసేవాడిని. బాగా డబ్బులు వచ్చేవి. దాంతో విపరీతంగా తాగేవాడిని. తాగిన మైకంలో భోజనమూ చేసేవాడిని కాదు. ఆరోగ్యం పాడయ్యేది. ఒక షూటింగ్‌కు వెళ్లి కార్యక్రమం అనంతరం ఇచ్చిన డబ్బులతో విపరీతంగా మద్యం సేవించాను. మైకంలో అక్కడే పడిపోయాను. లక్షలాది రూపాయల విలువైన నా కెమెరాలు, ఫోన్ చోరీకి గురయ్యాయి. అప్పటి నుంచి డిప్రెషన్‌లోకి వెళ్లిపోయి అప్పు చేసి తాగేవాడిని. అనకాపల్లిలో పరివర్తన డీ అడిక్షన్ సెంటరు ఏర్పాటు చేసిన విషయాన్ని నా భార్య తెలుసుకుని నన్ను అక్కడ చేర్పించింది. చేరిన రెండు రోజుల పాటు ఇబ్బంది పడ్డాను. వెళ్లిపోతానని మొండికేస్తే అక్కడ సిబ్బంది, కౌన్సెలర్లు నాకు కౌన్సెలింగ్ ఇచ్చి నెలరోజులపాటు చికిత్స చేశారు. మత్తు పదార్థాల నుంచి విముక్తి కోసం మందులు, ఇంజక్షన్లు ఇచ్చారు. యోగా నేర్పించడం, పత్రికలు, పుస్తకాలు చదివించడం, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములను చేశారు. దీంతో నెలరోజులు నేను మద్యం అనేది దరిదాపుల్లో లేకుండా ఉండగలిగాను. డిశ్చార్జి అయ్యాక ఇంటికి వచ్చాను. ప్రస్తుతం మద్యం జోలికి వెళ్లడం లేదు. ఎంచక్కా మామూలుగా షూటింగ్‌లకు వెళ్తూ వచ్చిన సంపాదనతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ఎప్పుడైనా ఇబ్బంది ఏర్పడితే పరివర్తన కేంద్రం వారితో ఫోన్లో మాట్లాడి సమస్యను పరిష్కరించుకుంటున్నాను. మామూలు మనిషిని అవుతానని కలలోనూ ఊహించలేదు.

– సాంబమూర్తి, ఫొటోగ్రాఫర్, మాకవారిపాలెం
(పేరు, ఊరు మార్చాం)

మత్తు నుంచి విముక్తి కల్పించడమే లక్ష్యంగా...

కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో అనకాపల్లి జిల్లాలో డీ అడిక్షన్ సెంటరు ఏర్పాటు చేశాం. ఇక్కడ ఉచిత, భోజన, వసతి సదుపాయాలతోపాటు, వైద్య సేవలు, కౌన్సెలింగ్ ఇస్తున్నాం. మత్తుకు బానిసైన వారికి విముక్తి కల్పిస్తాం. వారు జనజీవన స్రవంతిలో ఆరోగ్యంగా జీవించడం కోసం పరివర్తన కేంద్రం పనిచేస్తోంది. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

–వి.సన్యాసిరాజు,
కార్యదర్శి, సీడ్ సంస్థ

హెచ్‌ఎంకు షోకాజ్ నోటీస్

- ఇద్దరు టీచర్లకు మెమోలు
- డీఈవో పాఠశాలల ఆకస్మిక తనిఖీ

యలమంచిలి రూరల్: పాఠశాలల నిర్వహణ, టీచర్ల సమయపాలనపై జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ దృష్టి సారించారు. యలమంచిలి మండలం కె.పురుషోత్తపురం, పులపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పురుషోత్తపురం స్కూల్లో ఉదయం విద్యార్థులు ప్రార్థన చేసే సమయానికే చేరుకుని ఉపాధ్యాయులు ఎవరెవరు హాజరు కాలేదో పరిశీలించారు. ఉపాధ్యాయులు ఎం.అనూరాధ, కె.సుధారాణి నిర్ణీత సమయానికి స్కూలుకు హాజరుకాకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన డీఈవో వారిద్దరికీ మెమోలు జారీ చేశారు. ఈ పాఠశాలలో భవనాల మరమ్మతు పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని సమగ్ర శిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు సూచించారు. అనంతరం పులపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేయగా పాఠశాలలో తరగతి గదులు అపరిశుభ్రంగా ఉండటంతో ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీరామ్మూర్తిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి బాధ్యతగా హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు జారీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు.



పురుషోత్తపురం జెడ్పీ హైస్కూల్లో తనిఖీ చేస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

డయేరియా కేసులపై ప్రత్యేక దృష్టి

- గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై శ్రద్ధ
- అంటువ్యాధులపై అప్రమత్తం
- జిల్లా వైద్యాధికారి బాలాజీ

బుచ్చెయ్యపేట: జిల్లాలో డయేరియా కేసులు నమోదు కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకొని నో డయేరియా కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా వైద్యాధికారి ఎం.ఎస్.వి.కె.బాలాజీ తెలిపారు. మంగళవారం వడ్డాది పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలో హాజరు పట్టికను, మందుల స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఏఎన్ఎం, ఆశ కార్యకర్త ఇంటింటికి తిరిగి డయేరియా కేసులుంటే గుర్తిస్తున్నారని, ప్రతి ఒక్కరికి జింక్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందేలా చర్యలు చేపట్టామన్నారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా సంపూర్ణ పారిశుద్ధ్యం పాటించడమే కాకుండా ప్రతి వారం మంచినీటి ట్యాంకు క్లీనింగ్‌తో పాటు 10 రోజులకు ఒకసారి క్లోరినేషన్ చేయాలన్నారు. ప్రతి పీహెచ్‌సీల్లో 14 మంది వైద్య సిబ్బంది ఉండేలా పటిష్టమైన చర్యలు తీసుకోవడమే కాకటెక్కడ జ్వరాలు, డయేరియా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. వడ్డాది పీహెచ్‌సీని 24 గంటలు వైద్య సేవలు అందించాలని మండల సర్వసభ్య సమావేశాల్లో పలుసార్లు జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరీదేవి, మండల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తీర్మానం చేసి పంపించినా నేటికీ అమలు కాకపోవడంపై విలేకర్లు ఆయన్ని ప్రశ్నించగా వారం రోజుల్లోనే చర్యలు తీసుకుని వడ్డాది ఆస్పత్రిలో పగలు, రాత్రి నిరంతరం వైద్య సేవలు అందేలా చూస్తామన్నారు. వైద్యాధికారి శకుంతల, ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్ తదితర్లను ఆస్పత్రికి వస్తున్న కేసుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.



వడ్డాది పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి బాలాజీ

ఉచిత ప్రయాణంపై కసరత్తు!

- మహిళలు ఎక్కువగా ప్రయాణించే రూట్లపై ఆరా
- డిమాండ్ లేని రూట్ల బస్సులను మళ్లించే యోచన
- ప్రస్తుతానికి ఆర్డినరీ బస్సుల్లోనే ఫ్రీకి అవకాశం?

సాక్షి, విశాఖపట్నం : ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం హామీని ప్రభుత్వం ఎప్పట్నుంచి అమలు చేస్తోందని మగువలు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కొద్దిరోజుల్లో దీనిపై కార్యాచరణ రూపొందిస్తామని రవాణాశాఖ మంత్రి చెబుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు కూడా తమ వంతు కసరత్తు చేస్తున్నారు. విశాఖ నగరంలోకి వివిధ ప్రాంతాల నుంచి మహిళలు ఎక్కువ మంది వస్తున్నారు? వీరు ఏఏ రూట్లలో ఎక్కువగా ప్రయాణిస్తున్నారు? వంటి అంశాలను పరిశీలిస్తున్నారు. ఇలా నగరంలోకి కొత్తవలస, పెందుర్తి, ఆనందపురం, ఆరిలోవ, డైరీ ఫారం, కొమ్మాది, తగరపువలస, అనకాపల్లి, చోడవరం, సబ్బవరం తదితర ప్రాంతాల నుంచి మహిళలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తున్నట్టు ప్రాథమికంగా గుర్తించారు. వీరిలో ఆస్పత్రులు, షాపులు, షాపింగ్ మాళ్లు, వస్త్ర దుకాణాలు, పరిశ్రమలు, హోటళ్లలో పనిచేస్తున్న మహిళలు అధికంగా ఉన్నారు. వీరే కాకుండా వివిధ పనులు, ఉపాధి కోసం రోజూ వచ్చి వెళ్లే వారు, షాపింగ్‌కు వచ్చేవారు, పాఠశాలలు, కాలేజీలు, యూనివర్సిటీల్లో చదువుల కోసం రాకపోకలు సాగించే విద్యార్థినులు ఉన్నారు. వీరందరినీ ఆర్టీసీ అధికారులు కేటగిరీల వారీగా వేరు చేస్తున్నారు.

డిమాండ్ లేని రూట్ బస్సుల మళ్లింపు?

ఉచిత బస్సు ప్రయాణం పథకం అమల్లోకి వస్తే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య గణనీయంగా పెరగనుంది. ప్రస్తుతం ప్రయాణించే మహిళల కంటే సగటున 25 శాతం పెరగవచ్చని అంచనా. దీంతో ఇప్పుడు నడుస్తున్న బస్సులు వీరి అవసరాలను తీర్చలేవు. అందుకనుగుణంగా ఇప్పటికిప్పుడు బస్సులను పెంచే పరిస్థితి కూడా లేదు. అందువల్ల ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) తక్కువగా ఉండి రద్దీ లేని రూట్లలో తిరుగుతున్న బస్సులను మహిళలు ఎక్కువగా ప్రయాణించే రూట్లకు మళ్లించాలన్న యోచనలో ఉన్నట్టు సమాచారం.

తీరనున్న ఓఆర్ బెంగ

మరోవైపు ఆర్టీసీకి ఎప్పుడూ ఓఆర్ బెంగే వెంటాడుతుంది. ఓఆర్ పెరగడానికి ఆర్టీసీ అధికారులు తంటాలు పడుతుంటారు. అయితే ఇప్పుడు మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తే ఓఆర్ ఊపందుకుంటుందని ఆర్టీసీ అధికారులు లోలోన సంబరపడుతున్నారు. ఆర్టీసీ విశాఖ జిల్లా రీజియన్‌లో ప్రస్తుతం సగటు ఓఆర్ 65 శాతం ఉంది. ముందు ముందు అది గణనీయంగా పెరుగుతుందని వీరు చెబుతున్నారు. మహిళా ప్రయాణికులకయ్యే చార్జీల సొమ్మును ప్రభుత్వం ఆర్టీసీకి రీయింబర్స్ చేస్తుంది. అందువల్ల ఈ పథకం వల్ల తమ సంస్థకేమీ నష్టం ఉండబోదని ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు.

ప్రస్తుతానికి ఆర్డినరీలకేనా?

తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ ఆర్డినరీ, పల్లెవెలుగు, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అనుమతిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ప్రస్తుతానికి ఆర్డినరీ, పల్లెవెలుగు బస్సుల్లోనే వీరికి ఛాన్స్ ఇస్తారన్న ప్రచారం ఉంది.

సాగదీతకే ప్రాధాన్యం

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలును సాధ్యమైనంత కాలం సాగదీయడానికే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్న వాదన వినిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా రోజుకు రీయింబర్స్‌మెంట్ సొమ్ము భారీ మొత్తంలో ఉంటుంది. అందువల్ల ఆ భారాన్ని తగ్గించుకోవడానికి అధ్యయనం, పరిశీలనల పేరిట ఏదో వంక చూపుతూ కాలయాపన చేస్తోందన్న ప్రచారం జరుగుతోంది.

ఆటోల ఆదాయానికి గండి

ఈ పథకం ఆచరణలోకి వస్తే మొట్టమొదటగా ఆటో డ్రైవర్ల ఆదాయానికే గండి పడుతుంది. ప్రస్తుతం మహిళలు చాలావరకు ఆటోల్లో రాకపోకలు సాగించడానికే మొగ్గు చూపుతున్నారు. బస్సుల్లో ఉచిత ప్రయాణంతో ఆటోలను ఆశ్రయించే మహిళలు నామమాత్రంగానే ఉండనున్నారు. ఇదే ఇప్పుడు వీరిని ఆందోళనకు గురి చేస్తోంది.



ఆర్టీసీ బస్సులో మహిళా ప్రయాణికులు

గంజాయి నిర్మూలనకు ప్రత్యేక ప్రణాళిక

- ఎస్పీ కె.వి.మురళీకృష్ణ

అనకాపల్లి: జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, ఇతర డ్రగ్స్ నివారణకు 100 రోజుల ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశామని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ చెప్పారు. తన కార్యాలయంలో మంగళవారం నెలవారీ నేరసమీక్ష సమావేశంలో మాట్లాడుతూ ఒడిశా సరిహద్దు జిల్లాల నుంచి, ఏజెన్సీ ప్రాంతం వైపు నుంచి వివిధ మార్గాల్లో జరుగుతున్న గంజాయి అక్రమ రవాణా నిరోధించేందుకు జిల్లాలో నాలుగు స్టాటిక్ చెక్ పోస్టులను ఏర్పాటు చేయడంతోపాటు డైనమిక్ వెహికల్ చెక్ పాయింట్లను గుర్తించామన్నారు. జిల్లాలో 12 ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి గంజాయి రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి నిఘా ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. గంజాయి రవాణా జరిగే మార్గాలను గుర్తించి వివిధ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, గంజాయి కేసుల్లో తప్పించుకు తిరుగుతున్న నిందితులను అరెస్టులు చేయాలని, తరచూ నేరం చేసే గంజాయి నేరస్తులపై పీఐటీఎన్‌డీపీఎస్ చట్టం, పీడీ యాక్ట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ద్వారా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. నేరస్తులు అక్రమంగా సంపాదించిన ఆస్తులను చట్ట ప్రకారం స్వాధీనపరుచుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. బుధవారం అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆయన కోరారు. ఈనెల 29న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమంపై కక్షిదారులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.విజయభాస్కర్, పి.సత్యనారాయణరావు, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎస్.అప్పలరాజు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, దిశ డీఎస్పీ ఎం.ఉపేంద్రబాబు, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, అప్పలనాయుడు, కుమారస్వామి, గణేష్, సతీష్, సంజీవరావు, ఎస్సైలు రామారావు, రఘువర్మ తదితరులు పాల్గొన్నారు.



నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కె.వి.మురళీకృష్ణ

ఏ క్షణమైనా పెద్దేరు నీరు విడుదల

- ఏటి బాధిత గ్రామాలు అప్రమత్తంగా ఉండాలి
- జలాశయం జేఈ సుధాకర్‌రెడ్డి

మాడుగుల: పెద్దేరు జలాశయంలో రోజురోజుకు నీటిమట్టం పెరగడంతో జలాశయం నుంచి ఏ సమయంలోనైనా పెద్దేరులోకి వరద నీరు విడుదల చేస్తామని జేఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 137 మీటర్లు కాగా జలాశయంలోకి వరద నీరు చేరుతుండడంతో ప్రస్తుతం 136.30 మీటర్లకు చేరుకుంది. కేచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు అధికమైతే జలాశయం నుంచి ప్రధాన గేట్లు ఎత్తి వరద నీరు పెద్దేరులోకి విడుదల చేస్తామన్నారు. రాత్రి పూట రైతులు పెద్దేరులో దిగరాదన్నారు. పెద్దేరు ఏటిబాధిత గ్రామాలు సత్యవరం, జంపెన, వీరవిల్లి, వీరనారాయణం, జి.అగ్రహారం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జేఈ తెలిపారు.

క్లుప్తంగా

28, 29 తేదీల్లో జాబ్ మేళా



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్

మహారాణిపేట(విశాఖ) : మద్దిలపాలెంలోని వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఈనెల 28, 29 తేదీల్లో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన గోడ పత్రికను మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆవిష్కరించారు. టెక్ మహీంద్ర సంస్థలో 328 బీపీవో ఉద్యోగాల ఎంపిక కోసం నిర్వహించనున్న ఈ మేళాకు జిల్లా ఉపాధి కార్యాలయం, నోడల్ జవహర్ నాలెడ్జి సెంటర్ సంయుక్తంగా సహకారం అందిస్తున్నాయి. డిగ్రీ పాస్ లేదా ఫెయిల్, ఇంగ్లిష్ కమ్యూనికేషన్‌లో ప్రతిభ గల వారు అర్హులు. అర్హత గల అభ్యర్థులు https@//meqs.com/niVxxc px లింక్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. ఉత్తరాంధ్రలోని జిల్లాల వారు ఆయా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీల్లో ఆన్‌లైన్‌లో https@// employment.ap.gov.in వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి తెలిపారు.

అదుపు తప్పిన ట్రాలర్



సాకేతపురం జంక్షన్ వద్ద అదుపుతప్పిన ట్రాలర్

గోపాలపట్నం(విశాఖ): మర్రిపాలెం యార్డ్ నుంచి షీలానగర్ వైపు వెళ్తున్న భారీ ట్రాలర్ సాకేతపురం జంక్షన్ వద్ద అదుపుతప్పి.. పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలివీ.. మర్రిపాలెం యార్డ్ నుంచి ట్రాలర్ ఐరన్ లోడుతో మంగళవారం ఉదయం 6.30 గంటల సమయంలో షీలానగర్ వైపు బయలుదేరింది. జాతీయ రహదారిపై సాకేతపురం జంక్షన్ వద్ద ముందు వెళ్తున్న వాహనాన్ని డ్రైవర్ తప్పించబోగా.. అదుపుతప్పింది. ఫ్రీలెఫ్ట్‌లో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి.. ట్రాలర్ దిగువకు జారి నిలిచిపోయింది. అప్పటికి ఐదు నిమిషాల ముందు పారిశుధ్య కార్మికులు అక్కడే ఉన్నారు. మస్టర్ వేసుకుని, టీ తాగి పనులకు వెళ్లారు. వారు అక్కడే ఉండి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేదని స్థానికులు తెలిపారు. ఉదయం సమయం కావడంతో ట్రాఫిక్ రద్దీ కూడా లేదు. ట్రాలర్ కిందకు జారి ఉంటే.. కిందన ఉన్న హోటల్‌లోకి చొచ్చుకుపోయేది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ట్రాఫిక్, ఎయిర్‌పోర్టు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తులో ఉంది.

విషపూరిత వయ్యారి

- వయ్యారిభామ మొక్కతో అనేక నష్టాలు
- సమస్యాత్మక కలుపు మొక్కగా పంటలకు నష్టం
- రైతులకు చర్మ, శ్వాసకోశ వ్యాధులు
- పంటలకు చీడపీడలు
- సామూహిక నిర్మూలనే మార్గం



యలమంచిలి పట్టణం గాంధీనగరం మొదటి వీధిలో ఖాళీ స్థలంలో ఏపుగా పెరిగిన వయ్యారిభామ మొక్కలు, (ఇన్‌సెట్) వయ్యారిభామ పూత

యలమంచిలి రూరల్: ప్రపంచంలో మొండి జాతికి చెందిన 10 రకాల కలుపు మొక్కలలో పార్థీనియం ఒకటి. అమెరికాకు చెందిన ఈ కలుపు మొక్క సుమారు 70 ఏళ్ల క్రితం గోధుమ విత్తనాల దిగుమతితో మన దేశంలోకి ప్రవేశించింది. దీనిని ఇక్కడ వయ్యారిభామ, మాచర్ల కంప, ముక్కుపుడక అని పిలుస్తుంటారు. ఉత్తర భారతదేశంలో క్యారెట్ గ్రాస్, కాంగ్రెస్ గడ్డి, మంగమ్మ చెట్టు, నక్షత్ర గడ్డ అని కూడా అంటారు. ఈ కలుపు మొక్క కారణంగా వ్యవసాయంలో 40 శాతం వరకు పంట నష్టం వాటిల్లుతోంది. ఈ హానికరమైన, సమస్యాత్మక కలుపు మొక్క విస్తారంగా వ్యాపించి రైతులను పట్టి పీడిస్తోంది. ఈ కలుపు మొక్కను సామూహికంగా నిర్మూలించకపోతే రైతులకు తీరని నష్టం చేస్తుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఒక్కో మొక్క 10 వేల నుంచి 25 వేల విత్తనాలను ఉత్పత్తి చేస్తుంది. పంట పొలాల్లోను, బీడు, బంజరు, జనావాసాల చుట్టూ, పాడుబడిన ప్రదేశాల్లోనూ విస్తారంగా పెరుగుతుంది.

ఆరు వారాల్లోనే పూత

పార్థీనియం మొక్క సుమారు రెండు మీటర్ల ఎత్తు వరకు ఎదుగుతుంది. దీని ఆకులు చీలికలతో కూడి సన్నటి నూగులాంటి రోమాల మాదిరిగా పెరుగుతాయి. మొలకెత్తిన నాలుగు నుంచి ఆరు వారాల్లోనే పూత దశకు వస్తుంది. గాలి, నీరు, పశువులు, మనుషులు, వ్యవసాయ పనిముట్ల ద్వారా సులువుగా వ్యాపిస్తాయి. ఈ మొక్కలోని అన్ని భాగాల్లో (ఆకులు, కాండం, కొమ్మలపై నూగు పుప్పొడి) పార్థీనీష్ అనే విష పదార్థం ఉంటుంది. దీనివల్ల మానవాళికి పశువులకు వివిధ రకాల జబ్బులు వస్తాయి.

పార్థీనియంతో నష్టాలివీ...

పంట పొలాల్లో 40 శాతం, పశు గ్రాసం పంటలల్లో 90 శాతం దిగుబడిని తగ్గిస్తుంది. వాటి పుప్పొడి టమాట, వంగ, మిరప, మొక్కజొన్న పుష్పాలపై పడినప్పుడు వాటిలో ఫలోత్పత్తి తగ్గిపోతుంది. వేరుశనగ, టమాట, మిరప, ప్రొద్దు తిరుగుడు పంటల్లో మొవ్వ కుళ్లు తెగులును వ్యాప్తి చేస్తుంది.

- మనుషుల్లో డెర్మాటైటిస్, ఎగ్జిమా, హైఫీవర్, ఉబ్బసం, బ్రాంకై టిస్, పుష్పాల పుప్పొడితో జలుబు, కండ్లు ఎర్రబడడం, కళ్ల రెప్పలు వాయడం మొదలైన ఆరోగ్య సమస్యలు సంభవిస్తున్నాయి.
- పశువులలో వెంట్రుకలు రాలిపోవడం, హైపర్ టెన్షన్‌కు గురికావడం జరుగుతుంది. పశువులు ఈ మొక్కలను ఆహారంగా తీసుకుంటే చర్మ వ్యాధులు కలగడమే కాకుండా పాల ఉత్పత్తి తగ్గి బరువు కూడా కోల్పోతాయి.
- పార్థీనియం మొక్కలు పచ్చిక మైదానాల్లో గడ్డి రాకుండా చేస్తాయి. ఈ కారణంగా పశుగ్రాసం కొరతకు కారణమవుతాయి.

సమగ్ర నివారణే మేలు



పార్థీనియం మొక్కలను నిర్మూలించడానికి గ్రామాల్లో రైతులందరూ తమ పొలాల్లో సామూహికంగా చర్యలు చేపట్టాలి. పూత రాకముందే ఈ మొక్కలను వేర్లతో సహా పీకి తగలబెట్టాలి. వేసవిలో పొలాలను లోతుగా దుక్కి చేయడంతో కలుపు విత్తనాలు కూడా లోతుకు పోయి మొలకెత్తవు. తద్వారా పార్థీనియం ఉత్పత్తి తగ్గుతుంది. నీటి ఉధృతి ఎక్కువగా ఉన్న పొలాల్లో బంతి పంట మార్పిడి సాగు ద్వారా కూడా కలుపును నివారించవచ్చు. పైరు సాగు చేయని పొలాల్లో ఉప్పు ద్రావణాన్ని 15 లేదా 20 శాతం(లీటరు నీటికి 150 లేదా 200 గ్రాములు) పూతకు రాకముందే కలుపు మొక్కలపై పిచికారీ చేయడం ద్వారా కూడా వీటి ఉధృతి తగ్గించవచ్చు.

–పొలిమేర మోహనరావు, వ్యవసాయాధికారి, యలమంచిలి

సామూహిక నిర్మూలన అవసరం



సామాజిక భద్రత దృష్ట్యా పార్థీనియం వంటి కలుపు మొక్కలను సమర్థంగా నిర్మూలించడం అవసరం. ఒకసారి ఈ విత్తనం భూమిలో పడితే మూడు నాలుగేళ్లపాటు ఉంటుంది కాబట్టి వచ్చిన మొక్కను వచ్చినట్టుగా నాశనం చేయాలి. విత్తనం రాకముందే మొక్కలు తీసివేసి తగులబెట్టడం, లేదా ఎరువుగా మార్చుకోవడం చాలా ఉత్తమం. కలుపు మందులు వాడి కూడా దీనిని నివారించవచ్చు. దీని నిర్మూలనపై రైతులు, ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ఉంది.

–బండి నాగేంద్ర ప్రసాద్, సస్యరక్షణ శాస్త్రవేత్త, బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం, హరిపురం

తాడి చెట్టు పైనుంచి పడిన వ్యక్తి మృతి



మృతి చెందిన నూకరాజు

పాయకరావుపేట : ఈనెల 15వ తేదీన తాడి చెట్టు పైనుంచి పడిపోయిన వ్యక్తి మృతి చెందినట్టు ఎస్ఐ రామారావు తెలిపారు. పట్టణంలో గల ముస్లిం వీధికి చెందిన కుప్ప నూకరాజు (36) అనే వ్యక్తి కులవృత్తి అయిన కల్లు గీత నిమిత్తం స్థానికంగా గల రైలు పట్టాల పక్కన గల తాడి చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తూ చెట్టు నుంచి జారి పడిపోయాడు. బలమైన గాయాలు తగలడంతో తుని ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు ఎస్ఐ రామారావు తెలిపారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రామారావు తెలిపారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు



మరిసా గణేష్

యలమంచిలి రూరల్: మున్సిపాలిటీ పరిధి పెదపల్లి గ్రామానికి చెందిన యువకుడు మరిసా గణేష్ (26) సోమవారం సాయంత్రం నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నా కోసం ఎవరూ వెతక వద్దంటూ చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయిన యువకుడు గణేష్ మొబైల్ ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ అయింది. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. తెలిసిన అన్ని చోట్ల అదృశ్యమైన గణేష్ కోసం గాలించినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో మంగళవారం రాత్రి యలమంచిలి రూరల్ పీఎస్‌లో గణేష్ సోదరుడు మరిసా రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పైలా సింహాచలం విలేకరులకు తెలిపారు. అదృశ్యమైన యువకుడు తన సోదరుడికి సంబంధించిన పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నట్టు తెలిపారు. అదృశ్యం కావడానికి కారణాలు ఇంకా తెలియలేదని, యువకుడి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు

- 78 కిలోల గంజాయి స్వాధీనం
- ఒక బైక్, రెండు మొబైల్ ఫోన్లు సీజ్



పట్టుబడ్డ గంజాయితో పోలీసులు

రోలుగుంట : మండలంలో గంజాయి వ్యాపారులపై కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఐ ఎల్.సురేష్ సిబ్బందితో కలిసి దాడులు జరిపి ఇద్దరిని అరెస్టు చేశారు. ముందస్తు సమాచారంతో ఎంకే పట్నం పంచాయతీ శివారు పెదపేట గంగాలమ్మ గుడి వెనుక గంజాయి వ్యాపారులు ఉన్నట్టు గుర్తించి దాడి జరపగా నిందితులు అక్కడి నుంచి వాహనంపై తప్పించునే ప్రయత్నం చేయగా పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 78 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, వాహనాన్ని, రెండు మొబైల్ ఫోన్లు సీజ్ చేశారు. నిందితులు రోలుగుంట మండలం బీబీ పట్నం గ్రామానికి చెందిన మొయ్యా జ్యోతిబాబు(39), ఎం.కె.పట్నం గ్రామానికి చెందిన శరమండ ఈశ్వరరావుపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామన్నారు.

నాలుగు కిలోల గంజాయి పట్టివేత

గొలుగొండ : మండలంలో సీతకండి పరిసర ప్రాంతాల నుంచి ఇద్దరు వ్యక్తులు బైక్‌పై నాలుగు కిలోల గంజాయి రవాణా చేస్తున్న సమయంలో గొలుగొండ పోలీసులు పట్టుకొని మంగళవారం అరెస్టు చేశారు. అల్లూరి జిల్లాకు చెందిన దరసి విజయ్‌కుమార్, మామిడి మణికంఠను అరెస్టు చేసినట్టు ఎస్ఐ కృష్ణారావు తెలిపారు వారి వద్ద నుండ బైక్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఏజెన్సీ నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారంతో దాడి చేసి పట్టుకున్నట్టు చెప్పారు.

ఉద్రిక్తత నడుమ వడ్డాది పంచాయతీ బోర్డు సమావేశం



బోర్డు మీటింగ్‌కి హాజరైన సభ్యులు



బందోబస్తుకు వచ్చిన సీఐ,ఎస్ఐలు

బుచ్చెయ్యపేట : మేజర్ పంచాయతీ వడ్డాది పాలకవర్గ సమావేశం పోలీసు బందోబస్తు మధ్యన జరిగింది. సార్వత్రిక ఎన్నికల తరవాత వడ్డాది పంచాయతీ పాలకవర్గం సమావేశం మంగళవారం జరిగింది. సర్పంచ్, ఉప సర్పంచ్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉండి ఇటీవల ఎన్నికల ముందు కూటమిలో చేరారు. వడ్డాది పంచాయతీలో 14 మంది వార్డు సభ్యులకు, 12 మంది వైఎస్సార్‌సీపీ, ఒక టీడీపీ వార్డు మెంబర్ ఉన్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి గెలిచి వేరే పార్టీలోకి వెళ్లిపోయిన ఉప సర్పంచ్‌ను బోర్డు మీటింగ్‌లో మార్చాలని గ్రామ పెద్దలు, వార్డు మెంబర్లు ఇటీవల చర్చించుకున్నారు. అలాగే పంచాయతీ నిధులు వినియోగంపై బోర్డు మీటింగ్‌లో ప్రశ్నించాలని నిర్ణయించారు. దీంతో కూటమి, వైఎస్సార్‌సీపీ సభ్యుల మధ్యన బోర్డు మీటింగ్‌లో గొడవలు జరగొచ్చని గ్రామస్తులు భయందోళన చెందారు. ఈ నేపథ్యంలో కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు, బుచ్చెయ్యపేట ఎస్ఐ డి.ఈశ్వరరావులు తమ సిబ్బందితో ముందుగానే పంచాయతీ కార్యాలయం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, కూటమి నాయకులు శిరిగిరిశెట్టి దొరపిల్ల, అడపా నరసింహమూర్తి తదితరులు తమ అనుచరులతో పంచాయతీ సమావేశం వద్దకు వచ్చారు. సమస్యాత్మక గ్రామం కావడంతో సీఐ,ఎస్ఐలు తమ సిబ్బందితో అప్రమత్తం అయ్యారు. సర్పంచ్ కామలక్ష్మి సూరి అప్పారావు, వైస్ సర్పంచ్ దాడి సూరి నాగేశ్వరరావు, పది మంది వార్డు సభ్యుల సమక్షంలో ఈవో లవరాజు బోర్డు మీటింగ్ ఏర్పాటు చేశారు. వడ్డాది పంచాయతీ పరిధిలో ఒకరు షెడ్డుకని అనుమతి తీసుకుని కంపెనీలా భవనాలు నిర్మిస్తుంటే పంచాయతీ అధికారులు ఎందుకు అడ్డుకోలేదని పలువురు సభ్యులు ప్రశ్నించారు. నాలుగు రోడ్ల జంక్షన్‌లో ఆక్రమణలు తొలగించి, షాపులను పంచాయతీ అధీనంలోకి తీసుకొచ్చి పంచాయతీకి ఆదాయం వచ్చేలా చేయాలని, లే అవుట్‌లో ఆక్రమణలు తొలగించాలని పలువురు సభ్యులు సభలో ప్రస్తావించారు. దీనిపై చర్యలు తీసుకుంటామని ఈవో లవరాజు బోర్డు సభ్యులకు తెలిపారు. ఎటువంటి గొడవలు జరగకుండా బోర్డు మీటింగ్ జరగడంతో గ్రామస్తులు, నాయకులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

జల్సాల కోసం బైక్ దొంగతనాలు

- నలుగురి అరెస్ట్, ఆరు బైక్‌ల స్వాధీనం
- అంతా 20 ఏళ్ల వయసులోపు వారే..



వివరాలు వెల్లడిస్తున్న క్రైం డీసీపీ వెంకటరత్నం

అక్కిరెడ్డిపాలెం: చెడు వ్యసనాలు, జల్సాలకు అలవాటు పడి.. సులభంగా డబ్బులు సంపాదించాలనే అత్యాశతో దొంగతనాలకు పాల్పడిన నలుగురు కటకటాలపాలయ్యారు. పలు చోట్ల బైక్‌లు, సెల్‌ఫోన్లను దొంగలించిన వీరిని క్రైం పోలీసులు పట్టుకున్నారు. గాజువాక పోలీస్‌స్టేషన్‌లో క్రైం డీసీపీ ఎం.వెంకటరత్నం మంగళవారం ఈ వివరాలు వెల్లడించారు. ఈ నెల 20న తన బైక్ చోరీకి గురైందని గాజువాకకు చెందిన బాధితుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంటి ఆవరణలో బైక్ నిలిపి, ప్రహరీకి తాళం వేశానని, తర్వాత రోజు ఉదయం చూస్తే ప్రహరీ తాళం విరగ్గొట్టి ఉందని, బైక్ చోరీకి గురైందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇటువంటి నేరాలే గాజువాక, ద్వారకానగర్, న్యూపోర్టు, ఆనందపురం, ఎయిర్‌పోర్టు, 2 టౌన్, 3 టౌన్ పరిధిలో కేసులు నమోదైనట్లు డీసీపీ తెలిపారు. ఈ కేసు దర్యాప్తుకు జోన్-2 క్రైం ఏసీపీ సీహెచ్ శ్యామలరావు, సౌత్ సబ్ డివిజన్ క్రైం సీఐ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సీసీ ఫుటేజీల్లో బైక్ దొంగతనానికి పాల్పడుతున్నట్లు గుర్తించి.. సోమవారం షీలానగర్ అయ్యప్ప స్వామి ఆలయం వద్ద ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మరింత సమాచారం సేకరించి.. మరో ఇద్దరు యువకులను అరెస్ట్ చేశారు. వీరిలో మాధవధార పెన్‌స్కూల్ వెనుక నివాసం ఉంటున్న 20 ఏళ్ల సుంకర జగదీష్, కంచరపాలెం బాపూజీ నగర్‌కు చెందిన 19 ఏళ్ల చిక్కాల భరత్ ఉన్నారు. వీరి నుంచి సేకరించిన సమాచారంతో ఆరు బైక్‌లు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ తెలిపారు.

తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకే..

నిందితులంతా మధ్య తరగతి కుటుంబానికి చెందిన వారేనని డీసీపీ తెలిపారు. పైగా వీరంతా 20 ఏళ్ల వయసులోపే ఉన్నారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఏం చేస్తున్నారు? కళాశాలలకు వెళ్తున్నారా? వారిలో నిత్యం వచ్చే మార్పులేమిటి? తదితర అంశాలను గమనించాలని సూచించారు. పిల్లలపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల చెడు వ్యసనాలను గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అరెస్ట్ అయిన నలుగురు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసలయ్యారని డీసీపీ వివరించారు. రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన బైక్‌ల సంరక్షణకు సరైన జాగ్రత్తలు పాటించాలని నగర ప్రజలకు ఆమె సూచించారు. వీల్ లాకర్‌ను తప్పనిసరిగా వినియోగించాలన్నారు. వాహన కంపెనీలు బైక్‌లకు జీపీఎస్ ట్రాకర్ అమర్చిన తర్వాతే విక్రయించాలన్నారు. ఈ కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఆమె అభినందించారు. జోన్-2 క్రైం ఏసీపీ సీహెచ్ శ్యామలరావు, సౌత్ సబ్ డివిజన్ క్రైం సీఐ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



పాయకరావుపేట : పట్టణంలో గల బృందావనంలో దుర్గాలమ్మ చెట్టు సమీపాన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు ఎస్ఐ రామారావు తెలిపారు. సుమారు 55 సంవత్సరాలు వయస్సు కలిగిన పురుషుడు చనిపోయి ఉండడంతో స్థానికులు గమనించి పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. మృతుని వద్ద ఏవిధమైన ఆధారాలు లేవన్నారు. మృతదేహాన్ని నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

వ్యాపారులకు మార్గదర్శిగా గ్రంధి మనోజ్

సీతమ్మధార (విశాఖ): విశాఖపట్నంలో ఎంతో మంది వ్యాపారులకు దివంగత గ్రంధి మనోజ్‌కుమార్ మార్గదర్శిగా నిలిచారని ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ ఎండీ డాక్టర్ సుగంధి కొనియాడారు. ద్వారకానగర్‌లోని వైభవ్ జ్యూయలర్స్ షోరూమ్‌లో సంస్థ వ్యవస్థాపకుడు మనోజ్ 58వ జయంతి పురస్కరించుకుని మంగళవారం పలు సంక్షేమ, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అద్భుతమైన డిజైన్లు, అత్యున్నత కస్టమర్ సర్వీస్, ఉద్యోగుల సత్ప్రవర్తనతో వైభవ్ జ్యూయలర్స్ వినియోగదారుల ఆదరాభిమానాలు పొందిందన్నారు. ఏటా మనోజ్ జయంతి రోజున రక్తదానం వంటి సేవాకార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో 75 మందికి పైగా ఉద్యోగులు రక్తదానం చేశారు. లీ హెల్త్ డొమైన్(ఐ) ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం, మ్యాక్స్ విజన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం జరిగింది.

ఇంటర్‌తోనే ఉపాధి

- వృత్తి విద్యతో ఉజ్వల భవిష్యత్
- కొలువు గ్యారెంటీతో ఒకేషనల్ కోర్సులకు డిమాండ్
- ప్రభుత్వ ఆధ్వర్యంలో విశాఖలో ప్రత్యేక వృత్తి విద్యా కళాశాల
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 48 కాలేజీల్లో ఒకేషనల్ కోర్సులు
- ఈ ఏడాది ప్రవేశాలపై దృష్టి సారించిన అధికారులు



ఎంపీహెచ్‌డబ్ల్యు కోర్సు చేస్తున్న విద్యార్థినులు

విశాఖ విద్య: స్వశక్తితో సత్వరమే ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే లక్ష్యంతో నేటితరం యువత అనువైన మార్గాలను అన్వేషిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు గ్యారెంటీగా నిలిచే ఇంటర్మీడియట్ వృత్తి విద్యా(ఒకేషనల్) కోర్సుల వైపు మొగ్గు చూపుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో విశాఖపట్నం జిల్లాలో 11, అనకాపల్లి జిల్లాలో 27, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 10 కాలేజీల్లో ప్రస్తుతం ఒకేషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. గతేడాది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5,161 మంది ఒకేషనల్ కోర్సుల్లో అడ్మిషన్లు పొందారు.

ఉద్యోగం లేదంటే ఉపాధి గ్యారెంటీ కావడంతో నిరుపేద వర్గాలకు చెందిన విద్యార్థులు ఎక్కువగా వృత్తి విద్యా కోర్సుల్లో చేరుతున్నారు.

వృత్తి విద్యకు విశాఖలో ప్రత్యేకం

నగరంలోని మద్దిలపాలెంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఒకేషనల్ కాలేజీ అందుబాటులో ఉంది. ఇక్కడ 2008–09 విద్యా సంవత్సరం నుంచి వృత్తి విద్య కోర్సులను నిర్వహిస్తున్నారు. ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాలకు చెందిన విద్యార్థులకు ఇక్కడ ప్రవేశాలు కల్పిస్తున్నారు. రెండేళ్ల కోర్సులో ఇక్కడ ఏటా వెయ్యి మంది వరకు విద్యనభ్యసిస్తున్నారు. గతేడాది 464 మంది చేరగా, ఈ ఏడాది ఇప్పటికే 208 మంది అడ్మిషన్లు పొందారు.

పారామెడికల్ కోర్సులకు డిమాండ్

సత్వర ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించే మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్, ఫిజియోథెరపీ, ఫ్యాషన్ గార్మెంటరీ తదితర కోర్సులకు విద్యార్థుల నుంచి మంచి డిమాండ్ ఉంది. ఈ కోర్సులకు ప్రైవేట్ కాలేజీల్లో అయితే రెండేళ్లకు ఎంతలేదకున్నా రూ.30 వేల వరకు వ్యయం అవుతుంది. కానీ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే కళాశాలల్లో అడ్మిషన్ ఫీజు రూ.2,200, పరీక్ష ఫీజుగా రూ.600 చెల్లిస్తే కోర్సు పూర్తి చేయవచ్చు. విద్యార్థుల ఆసక్తిని దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల్లో సరికొత్త ఒకేషనల్ కోర్సులను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. అకౌంటింగ్ అండ్ ట్యాక్సేషన్, ఆఫీస్ అసిస్టెంట్ షిప్, బ్యాంకింగ్, రిటైల్ మార్కెటింగ్ వంటి కామర్స్ మెనేజ్‌మెంట్ కోర్సులు చేసిన వారిని ఉద్యోగాల్లో తీసుకునేందుకు కార్పొరేట్ కంపెనీలు ముందుకొస్తుండటంతో ఈ కోర్సులకు కూడా మంచి ఆదరణ ఉంది. ఇదే మాదిరి మెకానికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్, ప్రింటింగ్ టెక్నాలజీ వంటి కోర్సులు కూడా నిర్వహిస్తున్నారు.

లైంగిక దాడి యత్నం కేసులో ఇద్దరికి జైలు

విశాఖ లీగల్: బుద్ధిమాంద్యం గల బాలికపై లైంగిక దాడికి యత్నించిన ఇద్దరు యువకులకు ఐదేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరు రూ.15 వేలు చొప్పున జరిమానా చెల్లించాలని నగరంలోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనంది మంగళవారం తీర్పు చెప్పారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ అందించిన వివరాలిలా ఉన్నాయి. నిందితులు బొజ్జ సత్యనారాయణ, జలసూత్రం వరం గాజువాకలోని గుడివాడ అప్పన్న కాలనీలో ఉంటున్నారు. స్నేహితులైన వీరు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. 2016 జనవరి 20వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో బుద్ధిమాంద్యం గల బాలిక సమీపంలోని పాఠశాలకు వెళ్లి వస్తుండగా నిందితులు ఆమెపై కన్నేశారు. జింక్ వెనుక వైపు ఉన్న దారిలో కాపు కాశారు. బాలిక ముందు ఆమె అమ్మమ్మ ఎస్.లక్ష్మి కూడా ఉంది. ఇద్దరు యువకులు బైక్‌పై బాలికను అపహరించి లైంగిక దాడికి ప్రయత్నించారు. పక్కనే ఉన్న బాలిక అమ్మమ్మ గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు గుమిగూడారు. దీంతో వారు పారిపోయారు. బాధితురాలి అమ్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గాజువాక పోలీసులు నిందితులపై భారతి శిక్షాస్మృతి 354 ఏ కింద కేసు నమోదు చేశారు. పోక్సో చట్టం కింద కూడా కేసు నమోదు చేశారు.